క్లుప్తంగా

నేడు కార్తిక పౌర్ణమి వేడుకలు

కడప వైఎస్సార్ సర్కిల్ : నగర శివారులోని ఊటుకూరులో వెలసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం ఉంటుందని, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన మాసీమబాబు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు మాసీమ బాబు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మాసీమ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి తదితరులు గురువారం కలిశారు. తాడేపల్లిలోని మాజీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి జిల్లాలోని రాజకీయ పరిస్థితులను వివరించారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 13వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా, అధ్యాపకులు ఆవిష్కరించారు. 'మానవ విలువలు మరియు వృత్తిపరమైన నైతికత' అంశంపై ఈ సదస్సు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

కడప నగర క్రీడాకారుల ప్రతిభ



కబడ్డీ క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ, కోచ్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో శిక్షణ పొందిన కబడ్డీ క్రీడాకారులు ముగ్గురు ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అన్నమయ్య జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్–17 కబడ్డీ బాలుర విభాగంలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఎస్.నూర్‌బాషా, బి.బ్రహ్మయ్య, ఎం.మద్దిలేటిస్వామి ప్రతిభ కనబరిచి ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మధ్య ప్రదేశ్‌లో నిర్వహించే జాతీయస్థాయి ఏపీ జట్టుకు ప్రాతినిధ్య వహించనున్నారన్నారు. డీఎస్‌డీఓ కె.జగన్నాథరెడ్డి కోచ్ శ్రీధర్ వారిని అభినందించారు.

జవహర్ లాల్ నెహ్రూ సేవలు మరువలేనివి



జవహర్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్ : భారత తొలి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి అన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో నెహ్రూ కృషి, విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆయన సమర్పణ తదితర సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బండి జకరయ్య, సయ్యద్ సలావుద్దీన్, సుజాతరెడ్డి, సయ్యద్‌గౌస్‌పీర్, చిన్నకుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును రద్దు చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : వక్ఫ్ బిల్లును బీజేపీ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ నెల రోజుల క్రితం పార్లమెంట్‌లో వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరిస్తూ 40వ ప్రతిపాదన పెట్టడం దారుణం అన్నారు. ముస్లిమేతరులు వక్ఫ్ పాలకమండలిలో సభ్యులుగా ఉండాలనే నిబంధన పెట్టడం మత స్వేచ్ఛపై దాడిగా భావించాలన్నారు. బిల్లును ఉపసంహరించాలని అటు పార్లమెంటులో ప్రతిఘటించడంతోపాటు, వెలుపల ప్రజాక్షేత్రంలోనూ విశాల ఐక్యతతో లౌకిక ప్రజాతంత్ర శక్తులు ఉద్యమించడం అవసరమన్నారు. కేరళ అసెంబ్లీ తరహాలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్మానం చేసి పంపాలని కోరారు. వాగ్దానాలు అమలుచేయని పక్షంలో ఆవాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు, ఈ సమావేశంలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మహబూబ్‌బాషా, ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

గోవిందా.. ఇదేమి దారిద్ర్యం

కడప రూరల్: తిరుమల తొలి గడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కొలువైన దేవుని కడప దారి పరమ దారిద్ర్యంగా మారింది. మాసాపేట కూడలి నుంచి దేవుని కడపకు వెళ్లే పాదచారాలు, వాహనదారులనుదీ రోడ్డు ఇబ్బందులు పెడుతోంది. మంగళవారం పడిన కాస్త వర్షానికే దారుణంగా మారుతోంది. మట్టి పేరుకు పోవడంతో తారు రోడ్డు లేనందున ఒక వైపునకు వెళ్లే వాహనాలు భూమిలో కూరుకుపోతున్నాయి.

ఈ మార్గంలో అనునిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిపై ఎటు చూసినా గోతులు ఉండడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని రోడ్డును బాగు చేయాలని ఆ ప్రాంతాల వాసులుకోరుతున్నారు.



దేవుని కడపకు వెళ్లే రోడ్డులో గోతుల్లో నిలిచిన నీరు

వాహనాలపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది



సరైన రోడ్డు లేకపోవడంతో ఈ దారిలో వెళ్లలేకపోతున్నాం. ఈ రోడ్డు నుంచి రాకపోకలు సాగించాలంటే వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ఖాదర్‌బాషా, గౌస్ నగర్, కడప

గోతుల దారిని వెంటనే బాగుచేయాలి



ఈ రోడ్డంతా గోతులు ఏర్పడి దెబ్బతింది. మామూలు రోజుల్లో వెళ్లాలంటే కష్టంగా ఉంటుంది. అదే వర్షం వస్తే ఇంకా ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. అధికారులు వెంటనే రోడ్డు బాగు చేయాలి.

– షేక్ షఫీవుల్లా, అమీర్ నగర్, కడప

రేపటి నుంచి పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలు

కడప కల్చరల్ : మత సామరస్యానికి మారు పేరుగా నిలిచిన కడప అమీన్‌పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నామని దర్గాప్రధాన ముజావర్ అమీరుద్దీన్ తెలిపారు. గురువారం సాయంత్రం దర్గా ముషాయిరా హాల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల 16న గంధం, అనంతరం దర్గా నుంచి బాదుల్లా సాహెబ్ మకాన్ వరకు ఫకీర్ల ఊరేగింపు, మకాన్ వద్ద నుంచి మలంగ్‌షాను ఊరేగింపు ఉంటాయని, రాత్రి 7 గంటలకు దర్గా వద్దకు చేరుస్తామన్నారు. పీఠాధిపతి మలంగ్‌షాను దీక్ష వహింపజేస్తారని తెలిపారు. రాత్రి ఖవాలీ కచేరీ ఉంటుందన్నారు. దర్గా కార్యదర్శి సయ్యద్ గౌస్ మాట్లాడుతూ 17న మధ్యాహ్నం దర్గా ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు, సంస్థల గురించి వార్షిక నివేదిక సమర్పిస్తామన్నారు. రాత్రి 9 గంటలకు ఉరుసు ఉత్సవం ఉంటుందని, 18న తహలీల్ ఫతేహ ఉత్సవంలో భాగంగా ప్రసాద సమర్పణ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు. రాత్రి 80వ ఉర్దూ కవి సమ్మేళనం (ముషాయిరా) జరుగుతుందన్నారు. దర్గా సలహాదారులు ఖుతుబుద్దీన్ మాట్లాడుతూ 19న రాత్రి పది గంటలకు ప్రముఖ గాయకులచే ప్రత్యేకంగా ఖవ్వాలీ కచేరి నిర్వహిస్తామని తెలిపారు. 20న పీఠాధిపతి వాటర్ గండిలో జెండా ప్రతిష్ట, చదివింపులు నిర్వహిస్తారని, రాత్రి మాసాపేట మై అల్లా దర్గా వద్ద నుంచి కడప నగరంలో పీఠాధిపతి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 21న ఫకీర్లకు పీఠాధిపతి స్వయంగా ప్రసాదం అందజేసి ఆశీర్వదిస్తారన్నారు. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణంలో ఉత్సవానికి వచ్చే భక్తుల కోసం వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో దర్గా ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా వేయాలి

కడప ఎడ్యుకేషన్ : ఈ నెల 18వ తేదీన జరగాల్సిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సివి.ప్రసాద్, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర చంద్ర, అలీఖాన్ విద్యాశాఖను కోరారు. కార్తిక మాసం 3వ సోమవారం రోజున స్థానిక సెలవుగా వినియోగించుటకు విద్యాశాఖ అనుమతి కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ నెల కాంప్లెక్స్ సమావేశాలు 19, 20 తేదీలలో నిర్వహించాలని విన్నవించారు.

జోరున వర్షం



కడప కార్పొరేషన్ : కడప నగరంలో ఎడతెరపి లేకుండా గురువారం జోరున వర్షం కురిసింది. గురువారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండు, గురుకుల్ విద్యాపీఠం , వినాయకనగర్, ఎస్‌బీఐ కాలనీ, రామాంజనేయపురం, వరదకాలనీ, జర్నలిస్టుకాలనీ, బహుజన్ నగర్, సాగర్ కాలనీ, నంద్యాల నాగిరెడ్డి కాలనీ, అల్లూరి సీతారామరాజు నగర్‌లో నీరు నిలిచింది. వీధి వ్యాపారులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది.

రేపు పాలస్తీనా సంఘీభావ సభ

కడప వైఎస్సార్ సర్కిల్ : ఇజ్రాయిల్ తక్షణమే దాడులు ఆపాలని ప్రపంచ శాంతిని నెలకొల్పాలని జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే సంఘీభావ సభను జయప్రదం చేయాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ.బాదుల్లా, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గౌస్ కోరారు. నగరంలోని ఇన్సాఫ్ ఆధ్వర్యంలో గురువారం సభను జయప్రదం చేయాలని ప్రచారం చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి అమెరికా, నాటో దేశాల సామ్రాజ్యవాదం విఘాతం కలిగిస్తోందన్నారు. ఆయుధ వ్యాపారం కోసం అమెరికా యుద్ధాలను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అజ్మల్ ఖాన్ ఇన్సాఫ్, నగర ఉపాధ్యక్షుడు ఎస్.హుస్సేన్, ఎస్ఎండీ.ఆరిఫ్, జిలాన్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ఇన్సాఫ్ నాయకులు

కడప రూరల్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను నిరసిస్తూ ఈ నెల 16న జిల్లా పరిషత్ హాల్‌లో సభ నిర్వహిస్తున్నట్లు కడప సిటిజన్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఓబుళరెడ్డి, డాక్టర్ రాజావెంగళరెడ్డి, సభ్యులు బాబూబాయ్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం తక్షణమే ఆపాలన్నారు. అక్కడ శాంతిని నెలకొల్పాలని ఆకాంక్షిస్తూ ఈ నెల 16న కడప జెడ్పీ హాల్‌లో సాయంత్రం 4 గంటలకు జరిగే పాలస్తీనా సంఘీభావ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్‌రెడ్డి, పిల్లా విజయ కుమారస్వామి రెడ్డి, మక్బుల్‌బాషా, కృష్ణయ్య, ఎం.ప్రసాద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన ఫలితాలపై అవగాహన

వైవీయూ : జీవ సాంకేతిక శాస్త్రంలో జరుగుతున్న పరిశోధనలు, వాటి ఫలితాలు, క్షేత్ర స్థాయిలో వాస్తవిక పరిస్థితులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వృక్ష శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పి.వెంకటకృష్ణారెడ్డి అన్నారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో బయోటెక్నాలజీ స్టార్ స్టేటస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జన్యుపున సంయోజక మొక్కలు, ఉత్పత్తి వాటి ఉపయోగాలను వివరించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు వెంకటకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.రమేష్, వృక్ష శాస్త్ర విభాగాధిపతి రాజశేఖరరెడ్డి, డా.ఎం.సురేష్ బాబు, తిలక్ విద్యాసాగర్, శివరామకృష్ణ, డా. ఆర్.సీలయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



వక్త డా.పి.వెంకటకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

నెహ్రూను యువత ఆదర్శంగా తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : నెహ్రూను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి నజీబుల్లా పేర్కొన్నారు. వక్కలపేట ఉర్దూ ప్రైమరీ స్కూల్‌లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలల మంచి క్రమశిక్షణతో పాలు విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంచెంట్ అప్పాన్ని, ప్రేమకుమార్, ఎడ్యుకేషన్ సెక్రటరీ రాజేశ్వరి పాల్గొన్నారు.

చాచా నెహ్రూ జీవితం స్ఫూర్తిదాయకం

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా ఆశయ ఆకృతి బధిరుల పాఠశాలలో గురువారం వేడుకలు నిర్వహించారు. జాన్ ఇర్విన్ మాట్లాడుతూ చిన్నారుల కోసం నెహ్రూ చేసిన సేవలను కొనియాడారు. అంతకు ముందు నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌ఛార్జి సునీత, చైల్డ్ కేర్ డాక్టర్ విజయ, డాక్టర్ హరి కిషన్, నిషాఖాన్, రఘు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్

స్తంభించిన రాకపోకలు



పాత మార్కెట్‌లో స్తంభించిన ట్రాఫిక్



రోడ్డుపై అడ్డంగా వాహనాన్ని నిలబెట్టి అన్‌లోడ్ చేస్తున్న దుకాణాదారులు

కడప వైఎస్సార్ సర్కిల్ : నగరంలోని పాత మార్కెట్ దారిలో గురువారం మధ్యాహ్నం ట్రాఫిక్ స్తంభించడంతో వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 11 గంటలు దాటితే తోపుడు బండల వ్యాపారులు రోడ్ల పైకి వచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. దుకాణదారులకు వచ్చే సరుకులను రోడ్లపై అడ్డంగా వాహనాలు నిలిపి దించుకోవడంతో వాహనదారులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసు అధికారులు స్పందించి పాత మార్కెట్‌లో ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కిశోర బాలికలకు జాగ్రత్తలు అవసరం

ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కిశోర బాలికలకు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కిశోర వికాసంలో భాగంగా బాలల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని ఆమె సూచించారు. ప్రిన్సిపల్ సూర్యారావు మాట్లాడుతూ మహిళలకు సమస్య వస్తే నివారణ కొరకు 181, పిల్లలకు సమస్యలు వస్తే 1098, పోలీసు సహాయానికి 100 నెంబర్‌కి కాల్ చేసి తెలియజేయాలన్నారు. డాక్టర్ విష్ణు వందన మాట్లాడుతూ రేపటి భావితరాలకు ఉజ్వల భవిష్యత్తును అందించేది బాలికలే అన్నారు. అనంతరం అతిథులు వివిధ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది శారద, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుభాష్, ఎస్ఐలు శాంత, నశిరున్, ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు గోవిందరెడ్డి, షకీలా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న అధికారులు

స్వాతంత్ర్య ఉద్యమానికి ఊతంగా గ్రంథాలయాలు

కడప కల్చరల్ : గ్రంథాలయాలు దేశ స్వాతంత్ర్యోద్యమానికి ఊతంగా నిలిచాయని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించారు. ఉద్యమ నాయకులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వావిలాల గోపాలకృష్ణ, తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర్యోద్యమం ఉధృతం కావడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడ్డాయని కొనియాడారు. గౌరవ అతిథి, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్మీడియేట్ విద్యా మండలి విశ్రాంత సంయుక్త కార్యదర్శి ఆలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల ఔన్నత్యానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గ్రంథాలయ కార్యదర్శి సయ్యద్ అమీరుద్దీన్ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రాధాన్యత గురించి వివరించారు. రోజూ విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు ఉంటాయని వివరించారు. అనంతరం చిన్నారుల వేషధారణ పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ బాబ్జీ, గ్రంథాలయ సిబ్బంది సుబ్రహ్మణ్యం, శ్రీనివాసాచారి, నవాబ్‌జాన్, జేమ్స్, దేవదత్త, సమీర్ భాష, పుష్పరాజు, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



వివిధ పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో అతిథులు

అంధ విద్యార్థులకు టోల్ ఫ్రీ నెంబర్

కడప ఎడ్యుకేషన్ : అంధ విద్యార్థులకు న్యాయ సహాయం అవసరమైతే లీగల్ సర్వీసెస్ టోల్‌ఫ్రీ నెంబర్ 15100ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫ్రక్రుద్దీన్ పేర్కొన్నారు. కడప చెన్నూరు బస్టాండు వద్ద రాష్ట్రీయ సేవాసమితి (రాస్), ప్రభుత్వ అంధుల బాలుర పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విభిన్న ప్రతిభా వంతుల పిల్లల కోసం న్యాయ సేవా పథకం–2021 గురించి వివరించారు. అనంతరం పిల్లలకు రెండు వీల్ చైర్లు, 3 హియరింగ్ మిషన్లను, ఆరు డైసీ ప్లేయర్స్‌ను జడ్జి అందజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, ఎబినేజర్, వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అంధ విద్యార్థులకు డైసీ ప్లేయర్ అందజేస్తున్న జడ్జి బాబా ఫ్రక్రుద్దీన్

600 నీతి పద్యాల పుస్తకాల అందజేత

కడప కల్చరల్ : విద్యార్థులకు నైతిక విలువలు నేర్పే పాఠాలు అవసరమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పైనేని తులసీనాథంనాయుడు అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా కడప నగరంలోని పురపాలకోన్నత, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలల విద్యార్థులకు 600 నీతి పద్యాల పుస్తకాలను గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వంద పద్యాలు నేర్చుకుని చూడకుండా చెప్పే వారికి ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవ సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు. కడప గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన పద్యాలు నేర్పితే భాష గొప్పదనం తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



వేమన పద్యాల పుస్తకాలతో విద్యార్థులు, అతిథులు

పాఠశాలల్లో ఘనంగా బాలల దినోత్సవం

కడప ఎడ్యుకేషన్ : చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే అభివృద్ధి సాధించినట్లని వక్తలు పేర్కొన్నారు. గురువారం నెహ్రూ జయంతిని పురస్కరించుకుని కడప నగరంలోని సాయిబాబా హైస్కూల్, పవన్‌హైస్కూల్, శాంతినికేషన్ హైస్కూల్, బాలవికాస్, నాగార్జున మోడల్ స్కూల్, గురుకుల విద్యాపీఠం, పాఠశాల, డిల్లీ పబ్లిక్ స్కూల్‌లలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు పిల్లలతో కలిసి నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదేశానికి ఆయన అందించన సేవలను కొనియాడారు.



సాయిబాబా హైస్కూల్లో జాతీయ నాయకుల వేషధారణ పిల్లలతో కార్పొరేటర్ శ్రీదేవి,సాయి సుధీర్‌కుమార్



శాంతినికేతన్ హైస్కూల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పోచంరెడ్డిసుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి



డిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్ వివేకానందరెడ్డి



పవన్ హైస్కూల్లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి



గురుకుల విద్యాపీఠ్‌లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కరస్పాండెంట్, డైరెక్టర్ సిబ్బంది

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ పరిశీలన

పెండ్లిమర్రి : మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను గురువారం జిల్లా పంచాయతీ అధికారిని (డీపీఓ) రాజ్యలక్ష్మి పరిశీలించి అనంతరం సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. వర్మీ కంపోస్ట్‌ను తయారు చేయాల ని సిబ్బందికి సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. వర్మీ కంపోస్ట్ పంటలకు వాడితే పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగమల్లారెడ్డి, గంగిరెడ్డి, పంచాయితీ కార్యదర్శి లక్ష్మీపతి, గ్రీన్ అంబాసిడర్స్ పాల్గొన్నారు.



షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి